# ధర్మం - అధర్మం (4)

- బోస్ బేతనపల్లి, Fairlawn, NJ.

ఆ రోజు రాత్రి 10గంటలకు ఇల్లుచేరిన శామ్‌తో తను స్నోలో తిరగడం, చేసిన సాహసం, పడుతున్న తనను రాబర్టు పట్టుకొని ఆపడం, కాఫీ త్రాగడం-ఒక్కొక్క సంఘటన హుషారుగా చెప్పింది.

శామ్‌లో కోపం, బాధ రెండూ కలిగాయి ఒక్కసారిగా. 'బయటకు వెళ్ళొద్దు అన్నాగా? ఎందుకు వెళ్ళావు? ఏ కాలో చెయ్యో విరిగిందంటే పరిస్థితి ఎలా ఉండేది? చెప్పినా అర్థం చేసుకోవేమిటి? రాబర్టుతో అంతగా పెట్టుకోకు, వాడు మంచివాడు కాదు' అన్నాడు ఆవేశంగా.

శామ్ ఆవేశం చూసిన రీటాలో హుషారు ఎగిరిపోయింది. ఆ స్థానంలో భయం చోటుచేసుకొంది. రొమాంటిక్‌గా, ఈ సారి స్నోలో పడినప్పుడు కలిసి ఆడుకుందాములే అంటాడనుకొంది. అది లేదు సరిగదా, రాబర్టు చెడ్డవాడు అన్నాడు. ఎందుకు చెడ్డవాడో అడగాలనుకొంది. కానీ అడగలేకపోయింది. బయటకు వెళ్ళిన దగ్గరనుండి రాబర్టు తనను కంటికి రెప్పలా చూసుకుంటాడు. అన్ని పనులు హాయిగా జరిగేలా చూస్తాడు. సరదాగా మాట్లాడతాడు. అలాంటివాడు ఎందుకు చెడ్డవాడో తెలియలేదు రీటాకు. తను చేయలేని సహాయం రాబర్టు చేస్తున్నందుకు ఈర్ష్యగా ఉందేమో అనుకుంది. శామ్‌ని రెచ్చగొట్టడం ఎందుకులే అని సంభాషణ పొడిగించలేదు. ఎప్పుడైనా రాబర్టు కన్పించి పలుకరించినా చెప్పకపోవడం మంచిదిలా తోచింది. చెప్పి అపార్థాలకు ఛాన్సు ఇవ్వకూడదని నిర్ణయించుకొంది. బయటికి వెళ్తే కాలు విరుగుతుందేమో, అదో ఖర్చు అన్నట్లుగా ఉన్న అతని వ్యవహారం-భార్యగా, తోటి మనిషిగా గుర్తించి, చిన్న సరదా అయినా తీర్చకుండా పైగా కసురుకున్నాడు. మనసంతా బాధతో నిండిపోయింది రీటాకు.

శామ్ మౌనంగా, గంభీరంగా ఉండిపోయాడు. రీటాను పలుకరించే ప్రయత్నం చేయలేదు. ఇంకో మూడురోజులు ఏ విశేషమూ లేకుండా గడిచిపోయాయి. రీటా బయటికి వెళ్ళి మధ్యాహ్నం మూడు గంటలకు శామ్‌కి ఫోన్‌చేసి ఇంటికి వస్తూవుంది. రాబర్టు కన్పించలేదు రోడ్డుమీద.

శనివారం వచ్చింది. రేపు ఆదివారం రాబర్టు మనింటికి భోజనానికి వస్తాడని శామ్యూల్ చెప్పాడు.

రీటాకు సంతోషంగా అనిపించింది. ఈ మూడురోజులు, మాట్లాడే మనిషిలేక టైమ్ గడవడం కష్టం అయింది. శామ్యూల్ తూచినట్లు మాట్లాడతాడు. ఎప్పుడూ సీరియస్‌గా ఉంటాడు. మాట్లాడాలంటే ఒక విధమైన భయం పట్టుకొంది రీటాలో.

ఆదివారం వచ్చింది. శామ్ ఉదయమేలేచి కాలకృత్యాల పిమ్మట అపార్టుమెంటు వాక్యూమ్ చేశాడు. ప్రతి ఆదివారం శామ్ చేసే పనుల్లో అదొకటి. పదిగంటలకు 'మాస్'కు వెళ్ళడం, చర్చినుండి వచ్చి లంచ్‌తిని పుస్తకాలు ముందువేసుకొని రోజంతా చదవడంతో ఆదివారం అయిపోతుంది. రీటా, శామ్ చర్చినుండి 11:30 కు తిరిగివచ్చారు.

రీటా ఇడ్లీలు తయారుచేయడంలో నిమగ్నమయింది. మధ్యాహ్నం 12:30 కు రాబర్టు వచ్చాడు. తింటూ కబుర్లలో పడ్డారు. 'అయితే అన్నా! మీరు గుడికి వెళ్తుంటారా?' అని అడిగింది రీటా.

ఒక్కముక్కలో లేదంటూ తన సహజధోరణిలో 'మనిషి ఎక్కడ పుట్టినా, ఏ మతస్తుడైనా-మాటల్లో గాని చేతల్లోగాని పెద్దవాళ్ళను అనుకరిస్తూ జీవితం ప్రారంభిస్తాడు. అదీ కొంతకాలం మాత్రమే చేయగలుగుతాడు. చదువుతో పాటు వయస్సు పెరిగేకొద్దీ స్వంత ఆలోచనలు పెరుగుతాయి. చివరకు ఏదిమంచిదో, ఏమికావాలో నిర్ణయించుకొంటాడు. నమ్మకం సడలబట్టే మద్యం ముట్టనివాళ్ళు ఇక్కడ మద్యం సేవిస్తున్నారు. నాన్‌వెజ్ తిననివాళ్ళు ఇక్కడ తింటున్నారు. జగమెటిగిన బ్రాహ్మణుడికి జంధ్యమేల అంటూ జంధ్యాలు తీసి దండేలకు తగలించినవారూ ఉన్నారు. మత కలహాలు, ప్రాణనష్టాలు, ఆస్తినష్టం, మానభంగాలు, గృహదహనాలు ఇవన్నీ మనుషులు చేస్తున్నవే కాని దేవుళ్ళు కాదు.

సాటి మనిషిని కాస్త అర్థం చేసుకొని, స్వార్థం కొంచెం తగ్గించుకొని మానవతతో ఉండడమే నేను నమ్మే నిజం. చర్చికి వెళ్ళకపోతే ఏం?' అంటూ నవ్వాడు.

చిన్న ప్రశ్నవేస్తే పెద్ద జవాబు చెబుతాడు అనుకొని మాటమార్చుతూ 'మీరెప్పుడూ సిగరెట్టు మీద సిగరెట్టు కాలుస్తుంటారు. ఆరోగ్యానికి పొగ హానిచేస్తుందిగదా! ఎందుకు కాలుస్తుంటారు?' అంది.

' సిగరెట్టు అందమైన కన్నెపిల్లలాంటిది. ప్రాసలోనే చెప్పాలి జవాబు' అంటూ

' పెదవుల మీద ముద్దు
ఎపుడూ లేదు హద్దు
ఎలా చెప్పను వద్దు !
అది లేక గడవదు పొద్దు !'

' సిగరెట్టు ఒంటరివాడికి ఆప్తురాలు. వెచ్చదనాన్నిచ్చే వెన్నెల. సిగరెట్టు తాగేవాడికి అమెరికా ఒక స్వర్గం. సిగరెట్టు మీద ఎన్నిరకాల ఏడ్స్! అవి చూస్తే చాలు హుషారు వచ్చేస్తుంది. కాల్చాలన్న కోరిక కలగకపోతే ఆ మనిషి మనిషి కాదు' అంటూ ఇంకా ఏదో చెప్పబోతూంటే, 'చాలు, ఆపు' అంటూ బ్రేక్ వేశాడు శామ్. రాబర్టు గలగలా మాట్లాడే విధానానికి నవ్వుకుంది రీటా. శామ్ మాత్రం వీడికసలు బుద్ధిలేదు, సిగ్గులేదు. నోటికి ఎంతవస్తే అంత వాగుతాడు విచక్షణలేకుండా. దేవుడిమీద కూడా నిర్లక్ష్యమే అనుకున్నాడు.

తినడం అయింది. రాబర్టు సిగరెట్టు వెలిగించాడు. మాకెందుకు ఈ బాధ! నే చదువుకోవాలి వెళ్ళిరాకూడదూ! అంటూ రాబర్టుని సాగనంపేశాడు. రాబర్టు కూడా నవ్వుతూ శలవు తీసుకొని వెళ్ళిపోయాడు. రీటాను చూస్తూ 'వాడు అలాగే వాగుతుంటాడు నీవు పట్టించుకోకు' అన్నాడు.

శామ్ పుస్తకాలు ముందువేసుకుని కూర్చున్నాడు.

శామ్ ఇండియాలో హైస్కూలు అనిపించాడు. అక్క స్పాన్సర్ చేస్తే ఎగురుకుంటూ అమెరికా వచ్చాడు. దిగినతరువాత లోతు తెలిసినట్లు అమెరికాలో పరిస్థితులు వేరని గ్రహించాడు- బాధ్యత, క్రమశిక్షణ, విచక్షణ. తన కాళ్ళమీద తాను నిలబడతానని చెప్పినరోజున అక్క సంతోషించింది. దీవించింది. చదువు విలువ గ్రహించాడు. టైమ్ విలువ గ్రహించాడు. ధైర్యంగా విశాలప్రపంచంలోకి అడుగుపెట్టాడు. అనేక ఫ్యాక్టరీల్లో పనిచేశాడు. స్వెట్ షాపుల్లో మినిమమ్ వేజస్‌కి పనిచేస్తూ, చావలేక బ్రతుకుతున్న అనేకమందిని చూశాడు. అందరిదీ ఒకటే భయం. బ్రతుకు భయం. వాళ్ళకూ, తనకూ ఒకటే తేడావుంది. అది గ్రీన్‌కార్డు ఉండటం.

వయస్సుతో, జాతి కులాలతో నిమిత్తం లేకుండా చదువుకొని పైకి వచ్చేవాళ్ళకు ఎన్నో అవకాశాలు కన్పిస్తున్న అమెరికాను మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు. ఎలా అయినా మరో సంవత్సరం చదివితే వచ్చే అసోసియేట్ డిగ్రీ -ఈ ఇరుకు జీవితాన్ని రహదారిలో పెడుతుందన్న ఆశలో ఉన్నాడు. చదవాలి! చదవాలి! చదవాలి! మరోమెట్టు పైకి వెళ్ళాలి. అదే జీవితాశయం. అదే తన తపస్సు. అభం శుభం ఎరుగని అమాయకురాలు రీటా. రీటాకు తన మనస్సులో జరిగే యుద్ధం గురించి, పడ్డ కష్టాలగురించి చెప్పి ఆమె మనసు నొప్పించలేదు. సినిమాల్లో జరిగే మిరకిల్స్ జీవితాల్లో జరగవు. తన కష్టం ఫలించేరోజు దగ్గరలోనేవుంది. రీటాను సుఖపెట్టే రోజులు ముందున్నాయి. ఉత్సాహంతో చదువులో పడిపోయాడు శామ్యూల్.

మరో రెండురోజులు గడిచిపోయాయి ఏ విశేషాలు లేకుండానే రీటా బయటకు వెళ్ళడం. కాసేపు అలా తిరిగి మధ్యాహ్నం శామ్‌కి ఫోన్ చేయడం,

అంతరం .. (35 వ పేజీ తరువాయి)

గుండెలకు హత్తుకుంది. 'ఏ దేశమేగినా ఎందుకాలిడినా... పొగడరా నీ తల్లి భూమి భారతిని' అన్న పాట గుర్తుకు వచ్చింది ఆవిడకు "చూసేవా! అమ్మా! నీ మనవరాలిని. తెలుగు పద్యాలు, పాటలు అన్నీ వచ్చు. తెలుగు చక్కగా వ్రాస్తుంది, చదువుతుంది. సుశీలకు మన సంస్కృతి అంటే చాల ఇష్టం. భారతికి అన్ని నేర్పింది" అన్న కొడుకు మాటలకు ఆమె శరీరం పులకరించింది. మనవరాలి ఒత్తైన జడను తడిమి చూసింది. "సవరం కాదులే! బామ్మా! అసలయిన జడే!" అన్న రే మాటలకు అంతా నవ్వుకున్నారు. ఈ దేశంలో పుట్టి పెరిగినవారు విదేశ నాగరికత మోజులో పరుగెడుతూ వుంటే విదేశాలలో పుట్టి పెరిగిన వారు మన సంస్కృతి, ఆచారాలను, భాషను నిలబెట్టు కుంటున్నారంటే చాలా ఆశ్చర్యంగా, ఆనందంగా ఉంది అని గర్వ పడింది. విశాలక్షమ్మ. పాశ్చాత్య పోకడలను అనుసరిస్తున్న పెద్దకోడుకు కుటుంబానికి, విదేశాలలో ఉన్న అచ్చం 16 అణాల ఆంధ్రుని లక్షణాలతో ఉన్న చిన్న కొడుకు కుటుంబానికి గల 'అంతరం' చూసి తన అంతరంగంలో ఎంతో నొచ్చుకుంది విశాలక్షమ్మ.. ★

(తెలుగు సారస్వత సమూహం, 23 ఆగస్టు, 1997 సభలో చదివినది.)

## నీవే నా దిక్కంటి

నీవే నా దిక్కంటి నిను నమ్ముకొంటీ
నిను వీడి మనజాలరా.... ఓ బాబా
నను విడనాడకురా..... ఓ బాబా.....
నను విడనాడకురా...

కాయమె స్థిరమనీ, ప్రాయమె స్థిరమనీ
హేయముగ బ్రతికితిరా... ఓ బాబా
ధ్యేయమె మరచితిరా... ఓ బాబా నా
ధ్యేయమె మరచితిరా....

నీవే నా ధ్యేయము... నీవే నా జీవము
నీవే నా దైవమురా... ఓ బాబా...
నీవే నా సర్వమురా... ఓ బాబా...
నీవే నా సర్వమురా...

నీమాటే నా బాట, నీ పాటే నానోట
నీ చాటే నా కోటరా... ఓ బాబా...
నినుజేర నా వేటరా... ఓ బాబా...
నినుజేర నా వేటరా....

కానా నీవాడను, లేనా నీ నీడను
ఏమని వేడనురా.... ఓ బాబా...
దానును వీడనురా.... నీ
దానును వీడనురా....

ఏలా స్మరించాలో, ఏలా ప్రేమించాలో
ఏలా సేవించాలో.... ఓ బాబా...
ఆలా దీవించాలిరా... ఓ బాబా...
ఆలా దీవించాలిరా..

- మంత్రవాది శ్రీ రామమూర్తి
**Edison, NJ.**



ఇంటికి తిరిగి రావడం. జీవితం కాస్త యాంత్రికం అయిపోతూంది. రీటావచ్చి రెండువారాలు గడిచిపోయాయి. దారిలో రాబర్టు కన్పించాడు. నవ్వుతూ 'బాగున్నావా రీటా? ఏమిటి విశేషాలు?' అంటూ పలకరించాడు.

'ఒంటరితనం బోరుగావుంది. మాట్లాడటానికి మనిషి లేకపోవడం ఇంకా కష్టంగా ఉంది. పిచ్చిపట్టేటట్లు ఉంది. అంతకంటే విశేషాలు లేవు.' అప్పటివరకూ ముభావంగా ఉన్న రీటా చైతన్యస్రవంతే అయింది.

జవాబుగా 'గాసిప్పు అంటే ఏమిటి? ఇద్దరు మనుష్యులు కల్సినప్పుడు అక్కడలేని మూడోవ్యక్తి గురించి మాట్లాడుకోవడమే. విశేషాలు ఎందుకు ఉండవు? మనుష్యులు చేసే వింతపనులు, జీవిత విధానాలు తెలుసుకోవడమే విశేషాలు. నేషనల్ టి.వి. మీద రోజూ చూపిస్తూనే ఉంటారు లైవ్ షోస్. భలే!' అని రీటా అన్నట్టే అనుకరిస్తూ 'తల్లి తన బోయ్‌ఫ్రెండ్‌తో ఏకంగా లేచిపోయిన సంగతి తెలుకోవాలంటే 'జెన్నీ జోన్స్' షో చూడాలి. ఒక తండ్రి తన కూతురుతో పడుకుని పైగా రోజస్ పంపిన వైనం తెలుసుకోవాలంటే 'సేలి జెస్సీ రాఫల్' షో చూడాలి. ఒక అబ్బాయి తన గర్ల్‌ఫ్రెండ్ మదర్‌తో పడుకున్నాడన్న సంగతి తెలుసుకోవాలంటే 'జెర్రీ స్ప్రింగర్' షో చూడాలి. రేప్ చేసిన మనిషినే పెళ్ళిచేసుకొన్న అమ్మాయిని చూడాలంటే 'హెరాల్డో రెవేరా' షో చూడాలి. ప్రతిరోజు మిలియన్స్ మీద చూసే షోస్ ఇవి. మన జీవితాల్లో ఊహించనివి, విననివి సాధారణ సంగతుల్లా జరిగిపోతుంటాయి. ఇవి మనం ఎలా వాచ్ చెయ్యాలంటే' ఆగాడు రీటా రియాక్షను చూడటానికి.

'పతితులార, దళితులార' అన్న దృష్టితో మాత్రం కాదు. 'మరి' అంటూ అతన్నే చూస్తూ అంది.

'దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుష్యులోయ్' అన్న దృష్టితో చూడాలి. అమెరికా ప్రేమమయం. మనుష్యులు ఎలా ఉంటారో, వాళ్ళ కట్టుబాట్లు, వేషభాషలు- ఎలా నివసిస్తారో ఎంత తొందరగా తెలుసుకుంటే ఇంగ్లీషు అంత తొందరగా వస్తుంది. నీకు కాలక్షేపానికి కొదవవుండదు' అంటూ అన్ని షోస్ పేర్లు వ్రాసియిచ్చాడు.

'వీరంతా ఒక తరగతి మనుష్యులైతే, రెండవరకం మనుష్యుల్ని కూడా తెలుసుకుంటే అమెరికా గురించి తెలుసుకున్నట్లు ఉంటుంది' అంటూ కంటిన్యూ చేశాడు.

అతన్నే చూస్తోంది రీటా.

' సోప్ ఆపెరాస్‌లో ఆరడుగుల అందగాళ్ళు, ఆజానుబాహులు, గంభీర కంఠులు-త్రీపీస్ సూట్లు, టకటకలాడే బూట్లతో చక్కగా ఉండే హీరోలు - సన్నని కంఠాలు, సన్నని నడుమ్స్, హైచీక్ బోన్స్, బ్లాండీలు, బ్రూనెట్ బ్యూటీలు, నీలికళ్ళ నీలిమలు, బ్రవున్ కళ్ళ భామలు, సొట్టబుగ్గలు సుందరాంగులు- వీరు హీరోయిన్లు. చూపుల్లో సూదులు, మాటల్లో తేనెలతో కథ మందంగా మధురంగా నడుస్తూ చూసేవాళ్ళను టి.వి. కి అతుక్కుపోయేలా చేసే షోస్ ఇవి. సోమవారంనుండి శుక్రవారం వరకూ వస్తాయి. మిలియన్స్ వాచ్ చేస్తారు' అంటూ కొన్ని పేర్లు వ్రాసి ఇచ్చాడు.

రాబర్టు మాటలు వినడానికి అదోలా ఉన్నా, ఏ భావం లేకుండా సాధారణసంగతిలాగానే చెప్పాడు. మాటలకు ఫీలింగ్స్‌వుండవని, మంచి, చెడ్డ మనం అనుకోవడంలోనే ఉందని ఇంతకు మునుపు రాబర్టు మాటల్లో అంటూ - 'లావుగా భయంకరంగా కన్పిస్తున్న మనిషి మన దగ్గరకు వచ్చి ఎదురుగా నిల్చున్నప్పుడు తెలియకుండానే మనలో భయం కల్గుతుంది ఏమి జరగబోతుందో అని. అప్పుడామనిషి 'మీ పర్సు పడిపోయింది, మీరు చూసుకున్నట్లు లేద'ని వెళ్ళిపోతాడు. చీకట్లో తాడుని చూసి పాము అనుకున్నట్లేవుంటాయి మన రియాక్షన్స్' అన్నమాటల్ని గుర్తుతెచ్చుకొని చిన్నగా నవ్వుకుంది రీటా.

శలవు తీసుకుని వెళ్ళిపోయాడు రాబర్టు. ఇంత సులువుగా ఇంగ్లీషు నేర్చుకొనే పద్ధతివుంటే శామ్యూల్ ఇంతవరకూ ఎందుకు చెప్పలేదో మరి! అదేమిటో స్వంతంగా తెల్సుకోవాలన్న కోర్కె జనించింది రీటా మనసులో.

..............................................(ఇంకా వుంది)